సాక్షి చిత్తూరు

మంగళవారం। 11 । జూన్। 2024



అరణియార్ ఎదురు చేపలు

ఎన్నికల కోడ్ సందర్భంగా ఆగిన చేప పిల్లల విడుదలను త్వరగా చేపట్టాలని మత్స్యకారులు కోరుతున్నారు. - 8లో



అదుపులోకి రాని అతిసారం

పుత్తూరులో అతిసారం ఇప్పటికీ అదుపులోకి రాకపోవడంతో డిప్యూటీ డీఎంహెచ్ఓ పర్యటించి, సూచనలు చేశారు. - 8లో



పాత సీసా..కొత్త మద్యం!

రాష్ట్రంలో కొత్త మద్యం పాలసీ తీసుకొస్తోంది. మళ్లీ టెండర్ల ద్వారానే దుకాణాలు కేటాయించనున్నట్లు సమాచారం - 8లో

న్యూస్‌రీల్

వరసిద్ధుని సేవలో మాజీ స్పీకర్



మాజీ స్పీకర్ తమ్మినేనికి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని సోమవారం మాజీ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయనకు దేవస్థాన అధికారులు, సిబ్బంది స్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. స్వామి దర్శనభాగ్యం కల్పించి వేదపండితుల ఆశీర్వచనాలు అందించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు, స్వామిచిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, అధికారులు కోదండపాణి, విష్ణు తదితరులు ఉన్నారు.

పద్మ అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా పద్మ అవార్డులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఏటా గణతంత్ర దినోత్సవం రోజున పద్మ అవార్డులు అందజేస్తుందన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారు ఈ అవార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యరంగం, సామాజిక సేవ, సైన్స్, ఇంజినీరింగ్, ప్రజావ్యవహారాలు, పౌరసేవలు, వృత్తి, పరిశ్రమ మొదలైన రంగాలకు చెందిన వారు www.awards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు మొదటగా www.padmaawards.gov.in వెబ్‌సైట్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని చెప్పారు. ఆ తర్వాత దరఖాస్తు నమూనాను తిరుపతి జిల్లా కేంద్రంలోని అలిపిరి రోడ్డులో ఉన్న సెట్విన్ కార్యాలయంలో జూలై 22వ తేదీ లోపు అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 9440573537 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

టీటీడీ పీఆర్‌ఓగా నీలిమ



తిరుపతి(అలిపిరి): టీటీడీ పీఆర్‌ఓగా నీలిమ సోమవారం టీటీడీ పరిపాలనా భవనంలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పీఆర్‌ఓగా పనిచేస్తున్న టి.రవికి నాలుగు నెలల క్రితం సీపీఆర్‌ఓగా ఉద్యోగోన్నతి లభించడంతో ఆ స్థానంలో నీలిమ పీఆర్‌ఓగా బాధ్యతలు చేపట్టారు. నూతన పీఆర్‌ఓకు పలువురు జర్నలిస్టులు, ఉద్యోగులు , కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మోస్తరు వర్షం

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లాలో సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. సుమారు 149.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పాకాల మండలంలో 15.2 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా తిరుపతి రూరల్‌లో 1.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు వెల్లడించారు. కొద్దిరోజులుగా రోజూ చిన్నపాటి వర్షం కురుస్తుండడంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. వాతావరణం సైతం చల్లబడడంతో జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చిత్తూరు, తిరుపతి నగరాల్లో వీధికో ప్రైవేట్ స్కూల్ పుట్టుకొస్తోంది. ప్రతి ఏటా ఆ పాఠశాలల సంఖ్య పెరుగుతూనే ఉంది. తిరుపతి, శ్రీకాళహస్తి, పుత్తూరు, నాయుడుపేట, గూడూరు, చిత్తూరు, పలమనేరు, నగరి, కుప్పం, పుంగనూరులలో పలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఆయా బ్రాంచులను ప్రారంభించేందుకు సిద్ధమయ్యాయి. హంగులు, ఆర్భాటాలతో తల్లిదండ్రులను ఆకర్షించేందుకు వివిధ రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నాయి. ఎల్లుండి నుంచి పాఠశాలలన్నీ పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం.



గుర్తించకపోతే మోసపోతారు

- ప్రైవేట్ స్కూల్స్‌పై ఆరా తీయండి
- అన్నీ పరిశీలించాకే పిల్లలను చేర్పించాలి
- హంగులు, ఆర్భాటాలు చూసి వెళ్లొద్దు
- అనుమతులు, గుర్తింపులపై అడిగి తెలుసుకోవాలి
- ఈ నెల 13న పాఠశాలలు పునఃప్రారంభం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు ఈ నెల 13న పునఃప్రారంభం కానున్నాయి. మేడి పండు చూడ మేలిమైనుండు.. పొట్ట విప్పి చూడ పురుగులుండు అన్న చందాన ఆకర్షణీయ ప్రకటనలు, ఆకట్టుకునే ఆఫర్లు చూపించే ప్రైవేట్, కార్పొరేట్ మోసాలకు లోనుకాకూడదని పలువురు విద్యావేత్తలు, విద్యాశాఖ అధికారులు సూచిస్తున్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ప్రైవేట్ విద్యాసంస్థలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ప్రైవేట్ విద్యాసంస్థల్లో తమ పిల్లలను చేర్చాలనుకునే తల్లిదండ్రులు సదరు పాఠశాల ప్రభుత్వ గుర్తింపు పొందింది? లేనిదీ ముఖ్యంగా గమనించాలని, ఆ తరువాత పాఠశాలలో ఉన్న సదుపాయాలు, బోధన సిబ్బంది తదితర వివరాలు పరిశీలించిన తరువాతనే ముందుకు వెళ్లాలని హితవు పలుకుతున్నారు.

గుర్తింపు పొందిన స్కూల్స్ 1,177

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఆయా మండలాల పరిధిలో ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలు 1,177 ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. వాటిలో సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్ ఉన్న ప్రాథమిక పాఠశాలు 459, ప్రాథమికోన్నత పాఠశాలలు 251, ఉన్నత పాఠశాలలు 702 ఉన్నాయి. ఇందులో దాదాపు 2,54,421 మంది విద్యార్థులు అన్ని తరగతుల్లో విద్యనభ్యసిస్తున్నారు. ప్రతి ఏటా అధికారులు గుర్తింపు లేని పాఠశాలలు ఏమీ లేవని చెబుతుంటారు. అయితే పలు చోట్ల విద్యాశాఖ అధికారులను కార్పొరేట్ విద్యాసంస్థలు మోసం చేసి గుర్తింపు లేని శాఖలను నిర్వహిస్తున్నారు. వీటిపై తల్లిదండ్రులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

చిత్తూరు, తిరుపతి జిల్లాల ప్రైవేట్ బడుల సమాచారం

- ప్రాథమిక పాఠశాలలు 459
- ప్రాథమికోన్నత పాఠశాలలు 251
- ఉన్నత పాఠశాలలు 467
- విద్యనభ్యసిస్తున్న బాలురు 1,41,114
- విద్యనభ్యసిస్తున్న బాలికలు 1,13,307

అనుమతుల్లేని బడుల్లో చేర్పొద్దు

రాష్ట్ర ప్రభుత్వం అనుమతిలేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పితే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందే. చైల్డ్ ఇన్ఫో ఆధారంగానే విద్యార్థుల ప్రగతి పత్రాలు, బదిలీ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ అనుమతి లేని స్కూల్స్‌లో ఈ నమోదు ఉండదు. ఆయా విద్యార్థులను బడిబయట విద్యార్థులుగానే పేర్కొంటారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొత్త ప్రైవేట్ పాఠశాల ప్రారంభించాలంటే విద్యాశాఖ నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. అనుమతి తీసుకున్న తర్వాతే విద్యా సంస్థలను తెరిచి విద్యార్థులను చేర్చుకోవాలి. ప్రాథమిక స్థాయి పాఠశాలకు జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి, ఉన్నత పాఠశాలకు విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) ద్వారా పాఠశాల విద్యా కమిషన్ అనుమతి తీసుకోవాలి. సీబీఎస్ఈ సిలబస్ బోధించేందుకు కేంద్ర విద్యామండలి అనుమతులు ఇవ్వాల్సి ఉంటుందని విద్యాశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.

తెలుసుకోవాల్సిన అంశాలు

ప్రతి విద్యా సంస్థ ప్రభుత్వం నుంచి కచ్చితంగా గుర్తింపు పొంది ఉండాలి. గుర్తింపు పొందిన విద్యాసంస్థలలోనే తల్లిదండ్రులు పిల్లలను చేర్పించాలి. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా కొన్ని పాఠశాలలు ఇతర విద్యా సంస్థల తరపున పరీక్షలు రాయిస్తుంటాయి. అలా పరీక్ష రాసిన విద్యార్థులను ప్రైవేట్ విద్యార్థిగానే ప్రభుత్వం పరిగణిస్తుంది. ఇలాంటి విషయాల్లో జాగ్రత్త అవసరం.

తల్లిదండ్రులు పాటించాల్సిన జాగ్రత్తలు

- ప్రైవేట్ విద్యాసంస్థల్లో పిల్లలను చేర్చాలనుకునే తల్లిదండ్రులు ఆకర్షణీయమైన ప్రకటనలు చూసి మోసపోకూడదు.
- చేర్పించే పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు ఉందా లేదా? అనేది తొలుత చూసుకోవాలి. పాఠశాల భవనం నాణ్యతపై ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాన్ని పరిశీలించాలి.
- జి-1 భవనాలు ఉంటే అగ్నిమాపక పరికరాలు, ఆ స్థాయి దాటితే మంటలు ఆర్పే పూర్తి స్థాయి వ్యవస్థ ఉండాలి. సంబంధిత విభాగం నుంచి అనుమతి ఉండాలి.
- బాత్ రూములు, మరుగుదొడ్లు, నీటి సదుపాయం తదితర మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా చూసుకోవాలి.
- ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో 20 నుంచి 40 మందికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. ఉన్నత పాఠశాల అయితే సబ్జెక్టుల వారీగా ఒకరు చొప్పున ఉపాధ్యాయుడు ఉండాలి.
- విద్యార్థుల మానసిక, శారీరకోల్లాసానికి ఉపకరించే క్రీడా ప్రాంగణం, అనుగుణంగా క్రీడా ఉపాధ్యాయులు ఉన్నారా లేదా ఆరా తీయాలి.
- అన్ని సబ్జెక్టులకు అర్హత గల ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారా లేదా అన్న విషయం పరిశీలించాలి.

అనుమతులు లేకుంటే పాఠశాలలు సీజ్



“ప్రైవేట్, కార్పొరేట్ బడులకు తప్పనిసరిగా అనుమతులు ఉండాల్సిందే. పాఠశాలలు పునఃప్రారంభం నాటికి అనుమతులు లేకుంటే ఖచ్చితంగా సంబంధిత పాఠశాలలను సీజ్ చేస్తాం. తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించే ముందు తప్పనిసరిగా అనుమతులు ఉన్నాయా లేవా అని పరిశీలించాలి. ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ బడుల ఎదుట నోటీస్ బోర్డులో తప్పనిసరిగా సంబంధిత పాఠశాల వివరాలు నమోదు చేయాలి. పాఠశాల బోర్డుపై అనుమతి పొందిన నెంబర్ తప్పనిసరిగా ఉండాల్సిందే. లేకుంటే శాఖాపరంగా చర్యలు తీసుకుంటాం.

– దేవరాజు, డీఈఓ, చిత్తూరు జిల్లా

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



మాజీ మంత్రి పెద్దిరెడ్డితో నూకతోటి రాజేష్ తదితరులు

- మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

వరదయ్యపాళెం: రాజకీయాల్లో జయాపజయాలు సహజమని, ఎవరూ అధైర్యపడొద్దని.. అండగా ఉంటామని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం తిరుపతిలో పెద్దిరెడ్డిని ఆయన స్వగృహంలో నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్‌తోపాటు పిచ్చాటూరుకు చెందిన మండల మాజీ కన్వీనర్ హరిశ్చంద్రారెడ్డి, మరికొందరు నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. పిచ్చాటూరు మండలంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి స్వల్ప ఆధిక్యత తీసుకువచ్చామని, అయితే కొన్నిచోట్ల అనుకున్న మెజారిటీ రాని కారణంగా రాజేష్ ఓటమి చవిచూడాల్సి వచ్చిందని వివరించారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజల తీర్పును శిరసా వహించాలన్నారు. ప్రతి కార్యకర్త, నాయకుడు సంయమనం పాటించి పరిస్థితులకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. ప్రతి కార్యకర్తకు, పార్టీ శ్రేణులకు తాను, నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రణాళికాబద్ధంగా ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుదామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ కార్మిక విభాగం జిల్లా మాజీ అధ్యక్షుడు బీరేంద్ర వర్మ, సీనియర్ నాయకుడు భానుప్రకాష్ రెడ్డి, పిచ్చాటూరు సర్పంచ్ రోశయ్య, వరదయ్యపాళెం మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిందుకు విశ్రాంతి



విరమణ పొందిన బిందు



బిందును అభినందిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: ఏంటీ.. బిందుకు విశ్రాంతి అంటూ.. జాగిలం ఫొటో పెట్టారని చూస్తున్నారా..? నిజమే ఇక్కడ కనిపిస్తున్న పోలీసు జాగిలం పేరు బిందు. ఇది రిటైర్ అయితే జిల్లా ఎస్పీ వచ్చి శాలువ కప్పి సన్మానించారు. పోలీసు శాఖలో విశ్వాసంతో సేవలు అందిస్తే ఎవరికైనా ఇలాంటి గౌరవమే దక్కుతుంది. బిందు కూడా జిల్లా పోలీసుశాఖలో ఉద్యోగం చేస్తూ విరమణ పొందింది. సోమవారం చిత్తూరులోని ఆర్మ్‌డు రిజర్వు కార్యాలయంలో బిందుకు రిటైర్‌మెంట్ వేడుకలను నిర్వహించారు.

2013లో జన్మించిన బిందు, ల్యాబ్ (స్నిఫర్ డాగ్)జాతికి చెందిన జాగిలం. కొన్నాళ్లపాటు దీనికి పోలీసుశాఖలో శిక్షణ ఇచ్చి, ఆపై విధులను కేటాయించారు. జిల్లాకు ముఖ్యమైన నేతలు, అధికారులు వచ్చినప్పుడు బిందుకు విధులు అప్పగించేవారు. తిరుమల వెంకటేశ్వరస్వామి, కాణిపాకం వినాయకస్వామి ఆలయాల బ్రహ్మోత్సవాల్లో సంఘ విద్రోహ చర్యలను పసిగట్టేందుకు బిందుకు డ్యూటీ వేశారు. ఇక ఎన్నికలు, బందోబస్తు, వీఐపీ కార్యక్రమాల్లో సైతం ఇది విధులు నిర్వర్తించేది. ఇటీవల నిర్వహించిన పోలీసు డ్యూటీ మీట్‌లో గోల్డ్ మెడల్ కూడా సాధించింది. ఓసారి మదనపల్లెలో విధులు నిర్వర్తించేపుడు ఓ ప్రాంతంలో పెద్ద మొత్తంలో నిల్వ చేసిన నాటుబాంబులను బిందు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఇలా దాదాపు 11 ఏళ్ల పాటు విధులు నిర్వర్తించిన బిందు, ప్రస్తుతం విరమణ పొందింది. ఈ కార్యక్రమాన్ని పోలీసుశాఖ ఘనంగా నిర్వహించింది. చిత్తూరు ఎస్పీ మణికంఠ పాల్గొని బిందుకు పూలమాలవేసి, సన్మానించారు. ఇన్నేళ్లపాటు పోలీసు శాఖలో నిస్వార్థ విధులు నిర్వర్తించిన బిందు సేవలు మరిచిపోలేనివని అభినందించారు. అనంతరం ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాషా, ఆర్ఐ సుధాకర్ పాల్గొని బిందు సేవలను కొనియాడారు. దీని కేర్‌టేకర్ మోహన్ కుమార్‌ను సైతం అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

హైదరాబాదు నుంచి వచ్చి..

- ఈ జాతి జాగిలం జీవితకాలం 15 ఏళ్లు
- పోలీసుశాఖలో సాధారణంగా తొమ్మిదేళ్లపాటు సర్వీసు ఉంటుంది. ఈ జాగిలం చురుగ్గా ఉండడంతో రెండేళ్లపాటు సర్వీసును పొడిగించారు.
- హైదరాబాద్ నుంచి ఈ జాగిలాన్ని చిత్తూరు తీసుకొచ్చారు.
- పోలీసు శాఖలో బాంబులు, మందు పదార్థాలను పసిగట్టే విధులు కేటాయించారు. ఈ కారణంగా దీని ఆరోగ్యం క్షీణించే అవకాశం ఉంటుందని గ్రహించి, యాంటీబయాటిక్స్ (మందులను) ఎప్పటికప్పుడు పోలీసులు అందిస్తూ ఉంటారు.
- రిటైర్ అయిన తర్వాత కూడా బతికున్నంత కాలం ఈ జాగిలాన్ని పోలీసులే చూసుకుంటారు. డ్యూటీలు కేటాయించరు.

ముహూర్తం.. మూఢం

- శ్రావణం వరకూ మోగని పెళ్లి బాజాలు
- జూలై 8 వరకూ శుక్ర మూఢం
- ఆపై ఆషాఢ శూన్యం
- ఆగస్టు 7 తర్వాతే వివాహాలు, ఉపనయనాలు, గృహ ప్రవేశాలు
- మళ్లీ సెప్టెంబర్ 4 నుంచి అక్టోబర్ 3 వరకూ శూన్యమాసం



కాణిపాకం: ఈ ఏడాది శుభ ముహూర్తాలకు మూఢం అడ్డుపడింది. నెల రోజుల తరువాత మరోసారి శూన్యమాసం శుభకార్యాలకు ఆటంకంగా మారింది. దీంతో ప్రస్తుతం ఆగస్టు ఐదో తేదీ వరకూ పెళ్లి బాజాలకు బ్రేక్ పడింది. ఏప్రిల్ 28 నుంచి వరుసగా మూఢం రావడంతో రెండున్నర నెలలుగా వివాహాలు, ఉపనయనాలు, గృహ ప్రవేశాల వంటి శుభ కార్యాలు నిలిచిపోయాయి. క్రోధి నామ సంవత్సరం ఏప్రిల్ తొమ్మిదో తేదీ నుంచి ముహూర్తాలు ప్రారంభమై 26వ తేదీ చైత్ర మాసం వరకూ కొనసాగాయి. ఏప్రిల్ 28వ తేదీ చైత్ర చవితి ఆదివారం నుంచి జూలై ఎనిమిదో తేదీ వరకూ ఆషాఢ శుద్ధ తదియ వరకూ శుక్ర మౌఢ్యమి (మూఢం) నడుస్తోంది. మే 7 నుంచి చైత్ర బహుళ చతుర్దశి మంగళవారం నుంచి జూన్ ఏడో తేదీ వరకూ గురు మౌఢ్యమి నడిచింది. వరుసగా గురు, శుక్ర మౌఢ్యములు రావడంతో రెండు నెలలుగా వివాహాలకు ఆటంకం ఏర్పడింది. మరో వైపు జూలై ఐదో తేదీ నుంచి ఆషాఢ మాసం ప్రారంభం అవుతుంది. ఆషాఢ మాసం ఆగస్టు ఐదో తేదీ వరకూ కొనసాగుతుంది. ఇది శూన్యమాసం కావడంతో ఈ నెలలో కూడా వివాహాలు, ఉపనయనాలు, గృహ ప్రవేశాల వంటి శుభకార్యాలు నిర్వహించరు. మొత్తం మీద ఏప్రిల్ 28 నుంచి ఆగస్టు ఐదో తేదీ వరకూ పెళ్లి బాజాలు మోగే అవకాశం లేదని పండితులు, పురోహితులు చెబుతున్నారు. మూఢంలో కేవలం అన్నప్రాసన, అక్షరా భ్యాసం, నామకరణం, నూతన వ్యాపారాల ప్రారంభోత్సవాలు, సీమంతాలు, రిజిస్ట్రేషన్ల వంటి పనులను మౌఢ్యమిలోని మంచి రోజుల్లో చేసుకోవచ్చని పండితులు సూచిస్తున్నారు. సెప్టెంబర్ నాలుగో తేదీ నుంచి అక్టోబర్ మూడో తేదీ వరకూ భాద్రపదం కూడా శూన్యమాసం కావడంతో ఈ నెలలో వివాహాల ముహూర్తాలు ఉండవు.

శ్రావణ మాసంలోనే..

శ్రావణ మాసం ఆగస్టు ఏడో తేదీ నుంచి ప్రారంభమై 28వ తేదీ వరకూ నడుస్తుంది. ఈ నెలలోనే దివ్యమైన ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు. ఆగస్టు ఏడో తేదీ నుంచి 28 వరకూ ముహూర్తాలు ఉన్నాయి. వాటిలో 5,12,13,19, 20, 26, 27 తేదీల్లో శుక్ర, మంగళవారాలు మినహా అన్ని రోజులూ దివ్యమైన ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు.

ఉపాధికి గండి

గత రెండున్నర నెలలుగా వివాహ ముహూర్తాలకు మూఢాలు అడ్డంకి కావడంతో వందలాది మంది ఉపాధిపై తీవ్ర ప్రభావం పడింది. కేవలం వివాహాలపై ఆధారపడి ఎన్నో వృత్తుల వారు జీవనం సాగిస్తున్నారు. కల్యాణ మండపాలు, కేటరింగ్, వంటవాళ్లు, పురోహితులు, ఫొటో, వీడియో గ్రాఫర్స్, ట్రావెల్స్ కార్లు, బస్సులు, మినరల్ వాటర్స్, ఈవెంట్ మేనేజ్‌మెంట్లు, పూలు, డెకరేషన్స్, లైటింగ్, కూరగాయలు, కిరాణా, వస్త్ర, బంగారు, వెండి వ్యాపారాలు, షామియానాలు, మాంసపు దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, లాడ్జీలతోపాటు సాంస్కృతిక కళాకారులకు పని లేకుండా పోయింది. మరెంతో మంది రోజువారీ కూలీలకూ ఉపాధి కొరవడింది. అడపాదడపా చిన్నచిన్న ఫంక్షన్లు వస్తున్నా పెళ్లిళ్లు అయితేనే సరైన గిరాకీ లభిస్తుందని ఆయా వర్గాల వారి మాట. ఆగస్టు ఏడో తేదీ వరకూ మళ్లీ ఎదురు చూపులు చూడాల్సిందేనంటున్నారు.

శ్రావణంలో దివ్యమైన ముహూర్తాలు



“గురు, శుక్ర మౌఢ్యాలు వరుసగా రావడంతో వివాహాలు, ఉపనయనాలు, గృహ ప్రవేశాలు 70 రోజుల పాటు నిలిచిపోయాయి. ఏప్రిల్ 28 తర్వాత వివాహాలకు ఇంత వరకు మళ్లీ ముహూర్తాలు లేవు. శ్రావణ మాసంలో ఆగస్టు 7 నుంచి 28 వరకూ నాలుగైదు రోజులు మినహా దివ్యమైన ముహూర్తాలు ఉన్నాయి. సెప్టెంబర్‌లో మళ్లీ భాద్రపద మాసం శూన్యమాసం కావడం వలన వివాహ ముహూర్తాలు ఉండవు.

– సుధాకర్ గురుక్కల్, పండితులు, చిత్తూరు

బోయకొండ చైర్మన్ రాజీనామా



నాగరాజరెడ్డి

చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ ఆలయ పాలకమండలి కమిటీ చైర్మన్ పదవికి నాగరాజరెడ్డి సోమవారం రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కానున్న నేపథ్యంలో తన పదవికి రాజీనామా చేసినట్లు నాగరాజారెడ్డి పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి కృషిచేసిన ఈఓ చంద్రమౌళి, ఆలయ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. బోయకొండ ఆలయ పాలక మండలి డైరెక్టర్ పదవికి రాజేష్ సైతం రాజీనామా చేసినట్లు తెలిపారు.

క్లుప్తంగా

విగ్రహాల ధ్వంసం



ధ్వంసమైన నాగులమ్మ విగ్రహాలు

కుప్పంరూరల్: గుర్తు తెలియని వ్యక్తులు దేవతా విగ్రహాలను ధ్వంసం చేసిన సంఘటన కుప్పం మండలం, వసనాడుగొల్లపల్లెలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, వసనాడుగొల్లపల్లి సమీపంలో వెలిసిన శ్రీ నాగులమ్మ దేవాలయంలో నాగులమ్మ విగ్రహాలను దుండగులు ధ్వంసం చేశారు. విగ్రహాలను పదునైన ఆయుధాలతో తొలగించారు. విగ్రహాల కింద తవ్వకాలు చేపట్టడంతో, గుప్త నిధుల కోసమేనని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఉదయం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపడుతున్నారు. విగ్రహాల ధ్వంసం వెనుక స్థానికుల హస్తం ఉన్నట్లు పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తూ, ఆ దిశగా విచారణ సాగిస్తున్నారు.

చెక్‌డ్యామ్‌లో పడి యువకుడి మృతి

కుప్పంరూరల్: పుట్టిన రోజే చెక్‌డ్యామ్‌లో పడి యువకుడు కన్నుమూసిన సంఘటన కుప్పం మండలం, పాలారు డ్యామ్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, బెంగళూరుకు చెందిన మనో (18) సమీప బంధువుల పెళ్లి కోసం ఆదివారం కుప్పం మండలం, గుట్టపల్లెకు వచ్చాడు. పెళ్లి అనంతరం సోమవారం మనో పుట్టిన రోజు కావడంతో స్నేహితులతో కలిసి పాలారు చెక్‌డ్యామ్ వద్దకు వెళ్లారు. ఈత రాని మనో అక్కడ స్నానం చేస్తూ నీటిలో మునిగిపోయాడు. ఎంతసేపటికీ బయటికి రాకపోవడంతో స్నేహితులు గుట్టపల్లిలోని బంధువులకు సమాచారం ఇచ్చారు. చెక్ డ్యామ్ వద్దకు చేరుకున్న మనో బంధువులు, స్నేహితులు గజ ఈతగాళ్ల సాయంతో మనో మృతదేహాన్ని బయటికి తీశారు. మృతదేహానికి గుట్టపల్లిలోనే అంత్యక్రియలు నిర్వహించారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా, తమకు ఎలాంటి సమాచారం లేదని చెప్పారు.

పాత సీసా.. కొత్త మద్యం!

- త్వరలో నూతన మద్యం పాలసీ
- ప్రైవేటు మద్యం దుకాణాలవైపు చూపు
- చిత్తూరు జిల్లాలో 180 వరకు దుకాణాలు
- టెండర్ల ద్వారా దుకాణాల కేటాయింపు

చిత్తూరు అర్బన్: ప్రభుత్వం మారింది. పాలసీలు కూడా ఒక్కొక్కటిగా మారుతున్నాయి. రాష్ట్ర ఖజానాను బలోపేతం చేయడంపై నూతనంగా ఏర్పాటు కానున్న సర్కారు దృష్టి సారిస్తోంది. ఇదే సమయంలో తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తామని, ఇచ్చిన హామీలను కూడా చూస్తున్నారు. ప్రభుత్వానికి ప్రధాన ఆర్థిక వనరుగా ఉన్న మద్యం పాలసీపై కొత్తగా ఏర్పాటయ్యే ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. నూతన మద్యం పాలసీను అమలు చేయడానికి అనధికారికంగా ఇప్పటికే ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ నుంచి నివేదిక తెప్పించుకున్నట్లు సమాచారం. మరో 30 రోజుల్లో నూతన మద్యం పాలసీపై విధి విధానాలు వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ప్రైవేటు అనివార్యం

టీడీపీ ఇచ్చిన మేనిఫెస్టో అంశాల్లో కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని పేర్కొన్నారు. ఇది పరోక్షంగా ప్రైవేటు మద్యం దుకాణాల రాకను సూచిస్తోంది.



2019 ముందు వరకు జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాల ద్వారానే మద్యం విక్రయాలు జరిగేవి. ప్రతి రెండేళ్లకు ఓసారి మద్యం దుకాణాలకు టెండర్లు పిలవడం, లాటరీ పద్ధతిలో దుకాణాల కేటాయింపు జరిగేది. చిత్తూరు, తిరుపతి, మదనపల్లె ఉమ్మడిగా ఉన్నపుడు జిల్లాలో 430 మద్యం దుకాణాలు ఉండేవి. కేవలం దరఖాస్తు రుసుముల ద్వారానే రూ.2 కోట్ల ఆదాయం వచ్చేది. ఇక ఏటా మద్యం విక్రయాల ద్వారా జిల్లాలో రూ.1,850 కోట్ల ఆదాయం లభించేది.

నెల రోజుల్లో స్పష్టత

నూతన మద్యం పాలసీపై మరో నెల రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. పక్క రాష్ట్రాల్లో మద్యం పాలసీలను అధ్యయనం చేయడం, జిల్లాలో జనాభా ప్రాతిపదికన ఎన్ని దుకాణాలు పెట్టాలి, దరఖాస్తు రుసుము, లైసెన్సు ఫీజులు, దుకాణాల ఏర్పాటుపై నిబంధనలు తదితర విషయాలను పరిగణనలోకి తీసుకోనున్నారు. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో చిత్తూరులో ఏడు నియోజకవర్గాలు ఉన్న విషయం తెలిసిందే. ఈ ఏడు చోట్ల దాదాపు 180 మద్యం దుకాణాలు ఏర్పాటయ్యే అవకాశం ఉందని ఆబ్కారీశాఖ అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే మద్యం డిపోల్లో ఉన్న స్టాకు ఖాళీ చేస్తే తప్ప, కొత్త బ్రాండ్లు వచ్చే అవకాశం లేదు.



పర్యవేక్షణ ఎవరికో..?

మరోవైపు మద్యం దుకాణాల పర్యవేక్షణ బాధ్యత ఎవరికి అప్పగిస్తారనేదానిపై కూడా ఇంకా ఎలాంటి స్పష్టతలేదు. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్‌శాఖ ప్రస్తుతం రెండు విభాగాలుగా నడుస్తోంది. ఇందులో ఎస్‌ఈబీ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) అక్రమ మద్యం నివారణ, మద్యం స్మగ్లింగ్ కేసులను పర్యవేక్షిస్తూ జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పనిచేస్తోంది. సహాయ కమిషనర్ నుంచి జిల్లాలో ఎస్‌ఈబీ పోలీస్ స్టేషన్లు ఇందుకోసం పనిచేస్తున్నాయి. ఎక్సైజ్ శాఖ మద్యం డిపోల నిర్వహణ, ప్రభుత్వ మద్యం దుకాణాల బాధ్యతను పర్యవేక్షిస్తోంది. ఇందుకోసం డిపో మేనేజర్లు, సీఐలు, ఎస్ఐలు పనిచేస్తున్నారు. కొత్త మద్యం పాలసీ తీసుకొస్తే రెండు విభాగాలను మిళితంచేసి గత టీడీపీ ప్రభుత్వంలో ఉన్నట్లు చేస్తారా..? ఉన్నదాన్ని కొనసాగిస్తారా అనేది తెలియాల్సి ఉంది. మొత్తంమ్మీద పాతసీసాలో కొత్త మద్యం నింపినట్లు నూతన ఎక్సైజ్ పాలసీ గత టీడీపీ ప్రభుత్వంలో ఉన్నట్లే అమలయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తోంది.

నియోజకవర్గానికి నాలుగు బస్సులు

- చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి జన సమీకరణ
- సమీక్షలో కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : సీఎం ప్రమాణ స్వీకారానికి జన సమీకరణ కోసం జిల్లా వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గానికి నాలుగు బస్సులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆయన సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో పలు శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎం ప్రమాణస్వీకారం సభకు ప్రతి నియోజకవర్గం నుంచి ప్రజలు, ఔత్సాహికులను పంపేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కసరత్తును తహసీల్దార్, ఎంపీడీఓలు పర్యవేక్షించాలని తెలిపారు. ప్రతి బస్సుకు ఒక నోడల్ అధికారిని నియమించాలన్నారు. మంగళవారం సాయంత్రం బస్సులు ప్రతి నియోజకవర్గం నుంచి బయలుదేరి వెళ్తాయని తెలిపారు. 12వ తేదీన గ్రామాల్లో, మండల కేంద్రాల్లో, నగరాల్లో సీఎం ప్రమాణ స్వీకారం ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. 12వ తేదీన ఉదయం జిల్లా స్థాయి కార్యక్రమం చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డ్వామా పీడీ రాజశేఖర్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నగరిలో ఎమ్మెల్యే అనుచరులమంటూ దాడి

- విజయోత్సాహం మూడు రోజుల్లోనే ఆవిరి
- కలెక్టరేట్ ఎదుట టీడీపీ నాయకుల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన చేస్తున్న నగరి నియోజకవర్గం టీడీపీ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : టీడీపీ గెలుపుపై బ్యానర్ పెడితే తమపై దాడి చేశారంటూ నగరి నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులు లత ఉమాపతి, రామానుజం చలపతి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆ నాయకులు కళ్లకు గంతలు కట్టుకుని సోమవారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ టీడీపీ గెలిచిందనే సంతోషం తమకు మూడు రోజుల్లోనే ఆవిరైపోయిందన్నారు. టీడీపీ గెలుపొందినందుకు నగరిలో బ్యానర్ పెడుతున్న తమపై ఎమ్మెల్యే అనుచరులమంటూ కొందరు టీడీపీ గూండాలు దాడికి ప్రయత్నించారన్నారు. నగరి ఎమ్మెల్యే తమకు ఎలాంటి పదవులు ఇవ్వకపోయినా పరవాలేదు కానీ ఇలా దాడులకు పాల్పడడం సమంజసం కాదన్నారు. తమపై జరిగిన దాడిని అధిష్టానం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. టీడీపీ కోసం గత 24 ఏళ్లుగా కష్టపడుతున్న తమపై ఎమ్మెల్యే అనుచరులు దాడులు చేయడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. తీరు మార్చుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. తమకు ఏమి జరిగినా ఎమ్మెల్యే, ఆయన అనుచరులే కారణమవుతారని తెలిపారు. అనంతరం అధికారులకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. భక్తుల క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 81,744 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 36,833 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.34 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 16 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

అదుపులోకి రాని అతిసారం



అధికారులకు సూచనలు ఇస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధారాణి



నందిమంగళం దళితవాడలో వాటర్ పైప్‌లైన్ పనులు

- కొనసాగుతున్న వైద్య శిబిరం
- గ్రామంలో పర్యటించిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధారాణి

పుత్తూరు: పట్టణ పరిధిలోని నందిమంగళం దళితవాడలో అతిసారం అదుపులోకి రాలేదు. దీంతో సోమవారం మరో పది మంది విరేచనాలతో అవస్థలు పడ్డారు. అతిసారం ప్రబలడానికి కారణాలను అన్వేషించిన మున్సిపల్ అధికారులు పరమేశ్వర మంగళం పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శివ మినరల్ వాటర్ ప్లాంట్‌ను గుర్తించారు. పంచాయతీ సిబ్బంది నిర్వహిస్తున్న ఈ మినరల్ వాటర్ కేంద్రంలోని నీరు పూర్తి స్థాయిలో శుద్ధి కావడం లేదు. ఈ విషయం తెలుసుకున్న పరమేశ్వరమంగళం గ్రామస్తులు మాత్రం ఈ నీటిని వినియోగించడం లేదు. విషయం తెలియని నందిమంగళం, దళితవాడ ప్రజలు వినియోగించడంతో అతిసారం ప్రబలినట్లు అధికారులు తేల్చి చెప్పారు. ఈ శివ మినరల్ వాటర్ ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని లేదా మూసివేయాలంటూ గ్రామస్తులు కమిషనర్ కేఎల్‌ఎన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీనిపై కమిషనర్ మినరల్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. పంచాయతీ పరిధిలో ఉన్న ఈ కేంద్ర నిర్వహణపై ఎంపీడీఓతో చర్చించి తగిన నిర్ణయం తీసుకొంటామని కమిషనర్ తెలిపారు. గ్రామంలో తాగునీటి పైపులైన్ల ఏర్పాటు, మురుగు నీటి కాల్వల్లో పూడికలు తీయడం వంటి పనులు చేపట్టారు. గ్రామ ప్రజలకు ఆరోగ్య సూత్రాలపై వైద్య సిబ్బందిచే అవగాహన కల్పించారు. గ్రామంలో ఆరోగ్య సూత్రాలకు సంబంధించిన పోస్టర్లను ఏర్పాటు చేశారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ రెండు క్యాన్ల మినరల్ వాటర్‌ను సరఫరా చేశారు.

పరిస్థితిని సమీక్షించిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

నందిమంగళం దళితవాడలో సోమవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధారాణి పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. ప్రత్యేక శిబిరం కొనసాగిస్తూ వైద్య సేవలందించాలని వైద్య బృందాన్ని ఆదేశించారు. వైద్య సిబ్బందికి తగిన సూచనలు చేశారు. గ్రామంలో పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన చర్యలు తక్షణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామ ప్రజలు సైతం అధికారుల సూచనలను, సలహాలను తప్పక పాటించి సహకరించాలని కోరారు. వాతావరణ మార్పుల కారణంగా వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ఈ కింది జాగ్రత్తలు పాటించాలని కోరారు.

- ఇంటితోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.
- నిల్వ ఉంచిన ఆహారాన్ని తీసుకోరాదు. మంచినీటిని కాచి వడబోసి తాగాలి.
- దోమల బారిన పడకుండా దోమతెరలను వినియోగించాలి.
- ఇంటి పరిసర ప్రాంతాల్లో కొబ్బరి చిప్పల్లో, కూలర్లలో, రోళ్లలో, రిఫ్రిజిరేటర్లలో, పాతటైర్లలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలి.
- చెత్తను బహిరంగ ప్రదేశాల్లో, కాలువల్లో వేయరాదు. ఇంటి వద్దకు వచ్చే మున్సిపల్ సిబ్బంది చేతికి చెత్త బుట్టలను అందించాలి.







కాలువల్లో పూడిక తీస్తున్న మున్సిపల్ సిబ్బంది, గ్రామంలో మినరల్ వాటర్ పంపిణీ చేస్తున్న సిబ్బంది, కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

వీరంగం చేసిన సైకోకు దేహశుద్ధి

కుప్పంరూరల్: మారణాయుధంతో సైకో వీరంగం సృష్టించడంతో గ్రామస్తులు పట్టుకుని దేహశుద్ధి చేసిన సంఘటన కుప్పం మండలం, చిన్నబంగారునత్తం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు గ్రామానికి చెందిన రామస్వామి సోమవారం మారణాయుధం (బల్లెం)తో గ్రామంలోని జనాన్ని భయభ్రాంతులకు గురి చేశాడు. కొంతమందిపై దాడికి యత్నించాడు. గ్రామస్తులు కలిసికట్టుగా రామస్వామిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. రెండు గంటల పాటు మహిళలు, వృద్ధులు భయాందోళనకు గురయ్యారు. అనంతరం రామస్వామిని వైద్యం నిమిత్తం కుప్పం వందపడకల ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

అరణియార్ ఎదురుచేపలు

- ఎన్నికల కోడ్ కారణంగా ఆగిన చేప పిల్లల విడుదల
- ఇప్పటికైనా జలాశయంలో వదిలి పెట్టాలంటున్న మత్స్యకారులు
- త్వరలోనే నిర్ణయం తీసుకుంటామంటున్న అధికారులు

అరణియార్ జలాశయంలో వేట సాగించి వేలాది కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. సమృద్ధిగా లభించే మత్స్యసంపదను విక్రయించి పొట్టపోసుకుంటున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వం సైతం ఏటా లక్షలాది చేప పిల్లలను జలాశయంలో వదలడం ద్వారా మత్స్యకారులకు చేయూతనందిస్తోంది. ఈ ఏడాది సైతం పిల్లలను వదిలేందుకు వైఎస్సార్‌సీపీ సర్కారు సర్వం సిద్ధం చేసింది. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో మొత్తం ప్రక్రియ ఆగిపోయింది. దీంతో కేవలం చేపల వేటతోనే జీవనం సాగించే మత్స్యకార కుటుంబాలకు ఉపాధి పోయింది. రెక్కాడితే కానీ డొక్కాడని బడుగు బతుకులకు ఊరట కల్పించాల్సిన అవసరముంది. ఇప్పటికైనా డ్యామ్‌లో చేప పిల్లలను వదలాల్సిన బాధ్యత జిల్లా అధికారులపై ఎంతైనా ఉంది.



పిచ్చాటూరులో కళకళలాడుతున్న అరణియార్ జలాశయం



అరణియార్‌లో తెప్పపై చేపలు పడుతున్న మత్స్యకార్మికులు

పిచ్చాటూరు : అరణియార్ జలాశయంలో చేప పిల్లలు విడుదల చేయాలని మత్స్యకారులు కోరుకుంటున్నారు. ప్రతి ఏటా 10 లక్షల చేప పిల్లలను ప్రభుత్వం ఈ రిజర్వాయర్‌లో వదిలేది. అవి పెరిగి పెద్దదైతే వాటిని పట్టి అమ్ముకొని స్థానిక మత్స్యకారులు జీవించేవారు. అయితే ఈ ఏడాది మొదట్లోనే 10 లక్షల చేప పిల్లలు వదలడానికి అధికారులు సిద్ధం చేయగా ఎన్నికల కోడ్ అడ్డొచ్చి ప్రక్రియ ఆగిపోయింది. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం ఏర్పడుతున్న తరుణంలో జలాశయంలో చేప పిల్లలు విడుదల చేసి తమను ఆదుకోవాలని మత్స్యకార కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి.

వరదలో కొట్టుకుపోయిన చేపపిల్లలు

అరణియార్ గేట్ల సమీపంలో మత్స్యకేంద్రం ఉంది. ఇందులో ఏటా సుమారు 20 లక్షలకు పైగా చేప పిల్లలు పెంచడం, వాటిని జలాశయంలో వదలడం జరుగుతోంది. అయితే గత ఏడాది డిసెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు పూర్తి స్థాయిలో గేట్లన్నీ పైకెత్తి భారీగా వరద నీటిని కిందికి విడుదల చేశారు. ఆ సమయంలో చేప పిల్లలు పెంచే తొట్లన్నీ మునిగిపోయి, అందులో ఉన్న సుమారు 20 లక్షలు చేప పిల్లలు వరదలో కొట్టుకుపోయాయి.

2 వేల కుటుంబాలకు జీవనోపాధి

అరణియార్‌లో చేపలు పట్టుకుని పిచ్చాటూరుతో పాటు నింద్ర, కేవీబీ పురం మండలాల్లోని సుమారు 2 వేల మత్స్యకార కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. ఒక్కొక్కరు ఏడాదికి రూ.410 చెల్లించి లైసెన్సు తీసుకుని చేపల వేట సాగిస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో చేపల కొరత కారణంగా వీరందరూ పొట్టపోషణకు ఇబ్బంది పడుతున్నారు.

ఆదుకోవాలి



అరణియార్‌లో చేప పిల్లలు వదిలి మత్స్యకారులను ఆదుకోవాలి. ఈ వృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్నాం. ఎన్నికల కోడ్ అని చేపపిల్లల విడుదలను నిలిపివేశారు. ఇప్పుడైనా వదలాలని వేడుకుంటున్నాం.
– బాబు రెడ్డి, మత్స్యకారుడు, పిచ్చాటూరు

చేపల అమ్మకమే జీవనాధారం



చేపల అమ్మకమే మాకు జీవనాధారం. పిల్లలు వదలకపోవడం, జలాశయంలో ఉన్న చేపలు సైతం వరదలో కొట్టుకుపోవడంతో ఇప్పుడు మత్స్య సంపద తగ్గింది. దీంతో బతుకుదెరువు కష్టంగా మారింది. ప్రస్తుతం బయటి చెరువుల నుంచి చేపలు తెచ్చి అమ్ముకుంటున్నాం. దీంతో పెద్దగా లాభం లేదు.
– విజయన్, మత్స్యకారుడు, కీళపూడి, పిచ్చాటూరు మండలం

ఎన్నికల కోడ్‌తో ఆలస్యం



ఎన్నికల కోడ్ కారణంగా అరణియార్‌లో చేప పిల్లలు వదలడం ఆలస్యమైంది. నూతన ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత కలెక్టర్, ప్రజాప్రతినిధులతో చర్చించి చేపపిల్లలు వదలడానికి నిర్ణయం తీసుకుంటాం. మత్స్యకేంద్రంలోని పిల్లలు వరదకు కొట్టుకుపోవడం వల్ల కల్యాణి డ్యామ్ నుంచి చేప పిల్లలను తెప్పించాల్సి వచ్చింది. అన్ని రకాలు కలిపి సుమారు 10 లక్షల చేప పిల్లలను సిద్ధంగా ఉంచాం. – నాగరాజు, ఏడీ, మత్స్యశాఖ, తిరుపతి

టౌనుకొచ్చిన నెమలి!



ఇంటికొచ్చిన నెమలిని ఎఫ్ఎస్వో సుకుమార్‌కు అప్పగిస్తున్న యాకూబ్

పలమనేరు: అడవుల్లో చక్కర్లు కొట్టీ..కొట్టీ.. బోరు కొట్టిందేమో పట్టణంలో వింతలేమిటో చూద్దామని కాబోలు ఓ నెమలి జనావాసాల్లోకి వచ్చింది. ఏమాత్రం జంకూగొంకూ లేకుండా సంచరిస్తూ అందరి దృష్టినీ ఆకర్షించింది. ఈ సంఘటన పలమనేరులో చోటుచేసుకుంది. వివరాలు.. స్థానిక పెంకులకిషన్ మిషన్ ప్రాంతంలో యాకూబ్ అనే వ్యక్తి నివసిస్తున్నాడు. సోమవారం ఆయన ఇంటి వద్దకు ఓ నెమలి వచ్చి వాలింది. ప్రజలను చూసి బెదరిపోలేదు. దీనిని గమనించిన యాకూబ్ దానిని పట్టుకుని సంరక్షించారు. ఎఫ్ఎస్వో సుకుమార్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన అక్కడకు చేరుకున్నారు. యాకూబ్ ఆ నెమలిని ఆయనకు అప్పగించారు. కౌండిన్య అభయారణ్యం నుంచి ఈ నెమలి వచ్చి ఉంటుందని, తిరిగి దీనిని అభయారణ్యంలో వదలి వేస్తామని ఆయన చెప్పారు. యాకూబ్‌ను ఆయన అభినందించారు.

27న హుండీ లెక్కింపు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో హుండీ రాబడి కానుకలు ఈనెల 27 వతేదీన లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న తొలుత హుండీ లెక్కింపు చేపట్టాల్సి ఉండగా అనివార్య కారణాలతో లెక్కింపు తేదీని మార్చినట్లు చెప్పారు. ఈ లెక్కింపు కార్యక్రమానికి ఆలయ, బ్యాంకు, పోలీసు సిబ్బంది విధిగా హాజరు కావాలని కోరారు.